క్లుప్తంగా

నిరుపేదలకు రగ్గులు పంపిణీ



అభాగ్యులకు అందజేసేందుకు సిద్ధం చేసిన రగ్గులు

డాబాగార్డెన్స్ : చలికాలంలో నిరుపేదలు, అభాగ్యులు, రోడ్లపై నివసించే 2000 మందికి రగ్గులు అందజేస్తున్నట్టు ఆర్‌ఆర్ టీమ్ ఫ్రీడమ్ అధినేత డాక్టర్ రత్నరాజు పొలమరశెట్టి తెలిపారు. సోదరుడు రాజశేఖర్ జ్ఞాపకార్థం ప్రతి ఏటా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సమాజ సేవలో పాల్గొనాలని ఆయన కోరారు. వ్యాపారంలో అభివృద్ధి చెంది ముందుకు వెళ్తున్నప్పుడు తప్పనిసరిగా సమాజ సేవలో పాల్గొంటే ఎంతో మంది అభాగ్యులకు, సమాజానికి మేలు చేసిన వారం అవుతామని చెప్పారు. రాత్రి 11 నుంచి అర్ధరాత్రి 2 గంటల వరకు వివిధ ప్రాంతాల్లో ఉన్న అభాగ్యులకు అందజేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పి. సురేష్, సి. ప్రభాకర్, కేపీ బెహరా, వీరుమామా పాల్గొన్నారు.

అన్నదాతలను ఆదుకోవాలి



నిరసన తెలుపుతున్న వామపక్ష నేతలు

విశాఖ సిటీ : మిచాంగ్ తుపాను, కరువు కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని, ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు డిమాండ్ చేశారు. తుపాను బాధిత రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పైడిరాజు మాట్లాడుతూ తుపాను, కరువు నష్టాన్ని జాతీయ విపత్తుగా గుర్తించి కేంద్రం తక్షణ సాయంగా రూ.1000 కోట్లు, పూర్తి సాయంగా రూ.10 వేల కోట్లు ప్రకటించాలన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకుడు ఎం.కృష్ణారావు, సీపీఐఎంఎల్ జిల్లా నాయకుడు వై.కొండయ్య, ఎంసీపీఐ నాయకుడు కె.శంకర్రావు, ఆప్ నాయకులు గౌరీ శంకర్రావు, సీతల్, సీపీఐ జిల్లా కర్యవర్గ సభ్యులు ఎ.విమల, జి.రాంబాబు, సి.ఎస్. క్షేత్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోరుతూ ధర్నా

సీతమ్మధార : తమకు నెలకు రూ. 26 వేలు జీతం ఇవ్వాలని, పనిభారం తగ్గించాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లని ఆశాలుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ ఆశ వర్కర్లు 36 గంటలు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.పద్మ, వి.మేరీ, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి కేఎస్‌వీ కుమార్, యూనియన్ గౌరవ అధ్యక్షురాలు పి.మణి పెద్ద సంఖ్యలో ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ధర్నా..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ పార్కులో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు, ఆయాలు పాల్గొన్నారు.

మహిళలను గౌరవించాలి



మాట్లాడుతున్న సాంబశివరావు

బీచ్ రోడ్డు: ప్రతి ఒక్కరు మహిళలను గౌరవించాలని ప్రొఫెసర్ సాంబశివరావు అన్నారు. గురువారం కృష్ణా కళాశాల ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో పని చేసే చోట మహిళలపై అఘాయిత్యాలు అనే అంశంపై చైతన్య కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు తీసుకోవలసిన జాగ్రత్తలు, సమాజంలో రావాల్సిన మార్పులపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు విభాగాధిపతి డాక్టర్ ఆర్.కుసుమకుమారి, కాలేజ్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రంగా.. పరిసరాలు

- మురుగు నీటి బాధ లేదు.. దుర్గంధం జాడ లేదు
- వార్డుల్లో కాలువలు.. డ్రైనేజీల నిర్మాణం
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



సింహాలదేవిడి వద్ద కల్వర్టుకు మరమ్మతులు



యాతపేటలో కాలువల నిర్మాణం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తమ ఆశలు, ఆకాంక్షలు నెరవేరుతున్నాయని ప్రజలంటున్నారు. గతంలో కనీసం దక్కని మౌలిక సదుపాయాల భరోసా జగనన్న ప్రభుత్వం వచ్చాక తమకు దక్కుతుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. విద్య, వైద్యంతో పాటు పారిశుధ్యం, నాణ్యమైన విద్యుత్, స్వచ్ఛ జలం.. ఇలా చెప్పుకుంటూ పోతే అన్ని రకాలుగాను పేద, మధ్య తరగతి ప్రజల కనీస అవసరాలు సంతృప్తికరంగా తీరుతున్నాయని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలోని 33, 34 వార్డుల ప్రజలు మాట్లాడుతూ ఎంతో కాలంగా తమ వార్డుల్లో కాలువలు, డ్రైనేజీలు లేక మురుగు, దుర్గంధం మధ్యే మసిలేవారమని.. జగనన్న వచ్చాక కాలువలు, డ్రైనేజీలు నిర్మించి తమ సమస్య పరిష్కరించారని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.





బంగారుమెట్టలో నిర్మించిన కాలువ

అల్లిపురం : నియోజకవర్గంలో మురుగు నీటి పారుదల మెరుగుపడింది. గతంలో వార్డుల్లో కాలువల నిర్మాణం లేకపోవటంతో మురుగునీరు ఎక్కడికక్కడ నిలిచిపోయేది. కార్పొరేషన్‌కు ఎన్నికలు లేకపోవటంతో అభివృద్ధి కుంటుపడింది. రెండు సంవత్సరాల క్రితం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్‌కు ఎన్నికలు నిర్వహించడంతో కొత్తగా ఎన్నికైన కార్పొరేటర్లు తమతమ వార్డుల్లో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణాలు చురుగ్గా చేపట్టారు. గతంలో నియోజకవర్గంలో చాలా చోట్ల మురుగునీరు పారే సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. జీవీఎంసీ 33, 34 వార్డుల్లోని వివిధ ప్రాంతాల్లో కాలువలు, సీసీ రోడ్లు శిథిలావస్థకు చేరుకోవడంతో జీవీఎంసీ కౌన్సిల్‌లో అనుమతులు పొంది అభివృద్ధి పనులు వేగవంతం చేశారు. 33, 34 వార్డుల్లో రూ.1 కోటీ 12 లక్షల 95 వేలతో మురుగునీటి పారుదల సౌకర్యం మెరుగుపరిచారు.

కాలువలు నిర్మించిన ప్రాంతాలు.. చేసిన వ్యయం

33వ వార్డు..	
బంగారుమెట్టలో రూ.8.15 లక్షలు	లక్ష్మీదేవిపేటలో రూ. 4.20 లక్షలు
పేర్రాజు వీధిలో రూ.10.30 లక్షలు	75 ఫీట్ రోడ్డులో రూ. 3.00 లక్షలు
గౌరీవీధిలో రూ. 9.60 లక్షలు	అంబేద్కర్ కాలనీలో రూ.4.95 లక్షలు
34వ వార్డు ..	అచ్చియ్యమ్మపేట కాలనీలో రూ.4.98 లక్షలు
భూపేష్‌నగర్‌లో రూ.23.99 లక్షలు	తారకరామా కాలనీలో రూ.18.70 లక్షలు
కొబ్బరితోటలో రూ. 8.54 లక్షలు	కొబ్బరితోటలో రూ. 8.10 లక్షలు
అచ్చియ్యమ్మపేటలో రూ. 6.64 లక్షలు	మహాలక్ష్మీనగర్‌లో రూ.1.80 లక్షలు



నౌరోజీ రోడ్డులో నిర్మాణంలో గల కాలువలు

మురుగు సమస్య తప్పింది..



వార్డు పర్యటనలో భాగంగా మా వార్డు కార్పొరేటర్ తోట పద్మావతమ్మ మా ఇంటికి వచ్చారు. కాలువల పరిస్థితి అధ్వానంగా ఉందని చెప్పిన వెంటనే అధికారులతో మాట్లాడి కాలువల నిర్మాణం చేపట్టారు. అప్పటి నుంచి మురుగునీరు సక్రమంగా ప్రవహిస్తుంది.

– ధనమ్మ, యాతపేట

కాలువలు వేయించారు..



కార్పొరేటర్ పద్మావతి మా ప్రాంతంలో కాలువలు వేయించారు. గత పది సంవత్సరాలుగా కాలువలు లేక ఇబ్బంది పడేవారం. వార్డు పర్యటనలో మా అవస్థలు తెలుసుకున్న ఆమె వెంటనే కాలువల నిర్మాణానికి తగిన చర్యలు తీసుకున్నారు.

– కనకరాజు, యాతపేట

అడిగిన వెంటనే స్పందించారు..



కార్పొరేటర్ ఇంటింటికీ వచ్చి సమస్యలు తెలుసుకున్నారు. డ్రైనేజీలు బాగులేవని చెప్పిన వెంటనే స్పందించారు. అప్పటికప్పుడు అధికారులతో మాట్లాడి డ్రైనేజీ బాగు చేయించారు. మా కార్పొరేటర్ పద్మావతికి ధన్యవాదాలు.

–వి.నాగమణి, యాతపేట

త్వరలో అందుబాటులోకి నూతన రహదారులు



ఎమ్మెల్యే వాసుపల్లికి సమస్యలు విన్నవిస్తున్న స్థానిక మహిళలు

అల్లిపురం : పాత నగరం రోడ్ల విస్తరణ పనులు త్వరలో పూర్తయి నూతన సంవత్సర వేడుకల నాటికి రహదారులు అందుబాటులోకి రానున్నాయని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. 38వ వార్డు పర్యటనలో భాగంగా ఆయన గురువారం పప్పులవీధి, గంగాబత్తులవారివీధి, ఉక్కువారివీధి, శివాలయం వీధి, చిన్నమ్మవారి వీధి, ఓల్డ్ పోలీస్ క్వార్టర్స్, టౌన్‌హాల్ వీధి, బొబ్బిలివారివీధి, దూడావారివీధులలో పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అధికారులతో మాట్లాడి పరిష్కరించనున్నట్లు తెలిపారు. వీధుల్లో సీసీ రోడ్లు వేయాల్సి ఉందని, త్వరలోనే టెండర్లు పిలిచి పనులు మొదలుపెడతామన్నారు. జగదాంబ నుంచి పాతపోస్టాఫీసు వరకు రోడ్డు విస్తరణలో స్థలం కోల్పోయిన వారికి నష్టపరిహారంతో పాటు టీడీఆర్‌లు ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, రాష్ట్ర, జిల్లా కార్యదర్శులు, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే అన్ని వర్గాలకు మేలు



31వ వార్డులో సంక్షేమ ఫలాల బుక్‌లెట్ చూపుతున్న నాయకులు



36వ వార్డులో జగనన్న సంక్షేమం కిట్లు అందజేస్తున్న మాసిపోగు రాజు

దాబాగార్డెన్స్ : జీవీఎంసీ 31వ వార్డు డ్వాక్రా బజార్ సచివాలయ పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం గురువారం నిర్వహించారు. మండల అధ్యక్షుడు దొడ్డి బాపూ ఆనంద్ నేతృత్వంలో సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరించారు. పార్టీ జెండాను సరస్వతీ పార్క్ వద్ద ఎగురవేశారు. అనంతరం బాపూ ఆనంద్ మాట్లాడుతూ ప్రతి గడపకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉన్నారని, ఆయనతోనే అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో పెంటకోట నాగరాజు, రాము మాస్టార్, కాండ్రేగుల నాయుడు, గంటా శ్రీను, కృష్ణారెడ్డి, మోహన్, మహేష్, సచివాలయ కన్వీనర్లు గారి రాంబాబు, పెంటకోట బాబూరావు, గృహసారథులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు. అలాగే జీవీఎంసీ 36వ వార్డు రంగిరీజువీధి సచివాలయం పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. వార్డు నాయకుడు మాసిపోగు రాజు నేతృత్వంలో పార్టీ జెండా, సంక్షేమ బోర్డు ఆవిష్కరించారు. మా నమ్మకం నువ్వే జగనన్న కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ప్రతి పేదవాడికి సంక్షేమ ఫలాలు అందివ్వాలన్నదే ఈ కార్యక్రమ ఉద్దేశమన్నారు. గరుడా జగన్నాయకుల సత్రం చైర్మన్ కడియం ప్రసాద్, క్లస్టర్ ఇన్‌చార్జి సనపల రవీంద్రభరత్, కుందేటి సుధాకర్, కుడితి రవణమ్మ, కాకి పద్మ, రమణి, ఈశ్వర్ కిషోర్, చెన్నా శ్రీధర్, నర్సింగ్, కనకమహాలక్ష్మి, దనాల రాంబాబు, వై.కృష్ణవేణి, సరోజిని తదితరులు పాల్గొన్నారు.

మార్గశిర మాసోత్సవాలు ప్రారంభం



బంగారు చీరలో కన్యకా పరమేశ్వరి అమ్మవారు



సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

అల్లిపురం : వన్‌టౌన్‌లోని కురుపాం మార్కెట్ వద్ద గల కన్యకాపరమేశ్వరి ఆలయంలో గురువారం మార్గశిర మాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. మొదటి గురువారం సందర్భంగా అమ్మవారి ఆలయంలో మూలవిరాట్‌కు ప్రాత్ఃకాల ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారి మూలవిరాట్‌కు 108 స్వర్ణ పుష్పాలతో నివేదన చేశారు. స్వర్ణ వస్త్రాలంకరణ అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు కుమార్‌శర్మ మహిళలచే ప్రత్యేక కుంకుమ పూజలు చేయించారు. ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు అరిసెట్టి దివాకర్, గ్రంధి రామకృష్ణ, కోశాధికారి సుగ్గ శివకుమార్ మాట్లాడుతూ మార్గశిర మాసంలో వచ్చే ఐదు గురువారాలు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, మహిళలచే కుంకుమ పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

వాకర్స్ పార్కులో విద్యుత్ వెలుగులు



మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో వీధిలైట్లు ఏర్పాటు చేశారు. పార్కులో వెలగని దీపాల విషయమై జీవీఎంసీ విద్యుత్ శాఖ వీధిలైట్ల విభాగం అధికారులకు వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి తెలియజేశారు. దీనిపై అధికారులు స్పందించారు. పార్కులో వెలగని రెండు విద్యుత్ లైట్లను గురువారం ఏర్పాటు చేశారు. దీంతో ఇక్కడ చీకట్లు తొలగడంతో పార్కు సందర్శకులు, వాకర్స్ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యను పరిష్కరించిన అధికారులకు పల్లా చంద్రమౌళి కృతజ్ఞతలు తెలిపారు.

పుస్తక పఠనంతో సృజనాత్మకత



క్విజ్ పోటీల విజేతలతో అతిథులు

విశాఖ సిటీ: పుస్తక పఠనంతో పిల్లల్లో విజ్ఞానం, సృజనాత్మకత పెంపొందుతాయని దేవదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ లక్ష్మీప్రసన్న పేర్కొన్నారు. టర్నర్‌చౌల్ట్రీలో జరుగుతున్న విశాలాంధ్ర బుక్ హౌస్ పుస్తక మహోత్సవంలో భాగంగా గురువారం వివిధ పాఠశాలల విద్యార్థులకు వీ డెంటల్ హాస్పిటల్ సౌజన్యంతో క్విజ్ పోటీలు నిర్వహించారు. జూనియర్ విభాగంలో మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానం కైవసం చేసుకోగా, ద్వారకానగర్ రవీంద్ర భారతి స్కూల్ విద్యార్థులు ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. సీనియర్ విభాగంలో రవీంద్ర భారతి స్కూల్ ప్రథమ స్థానం కైవసం చేసుకోగా, మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్ ద్వితీయ స్థానంలో నిలిచింది. విజేతలకు ఈవో లక్ష్మీప్రసన్న బహుమతులతో పాటు సర్టిఫికెట్లు, వీ డెంటల్ హాస్పిటల్ ఫ్యామిలీ హెల్త్ కార్డ్, డెంటల్ కిట్లు అందజేశారు. క్విజ్ మాస్టర్లుగా ప్రసన్న కుమార్, నవ్య సిరికి, కె.పృథ్వీరాజ్ వ్యవహరించారు. వీ డెంటల్ హాస్పిటల్ డైరెక్టర్ కె.ఎం.కె.రమేష్, విశాలాంధ్ర బుక్ హౌస్ మేనేజర్ పి.ఎ.రాజు తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో బుల్లయ్య కళాశాలకు పతకాలు

సీతంపేట: ఈ నెల 12, 13 తేదీల్లో ఆంధ్రా యూనివర్సిటీలో జరిగిన అంతర కళాశాలల పురుషులు, మహిళల అథ్లెటిక్స్ పోటీల్లో లంకపల్లి బుల్లయ్య కళాశాల విద్యార్థులు పలు విభాగాల్లో పతకాలు సాధించారు. మహిళా అథ్లెట్లు 800, 1500, 5000 మీటర్లు, రిలే, 21 కిలో మీటర్ల మారథాన్ పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌షిప్ ఆఫ్ రన్నర్ అప్‌గా నిలిచారు. పురుషుల జట్టు జావెలిన్, డెకథ్లాన్, రిలే, లాంగ్‌జంప్, హైజంప్ విభాగాల్లో బంగారు, రజత, కాంస్య పతకాలు పొందారు. ఈ సందర్భంగా గురువారం విజేతలను కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ అభినందించారు.

అలరించిన డోజో మోజో నాటకం



డోజో మోజో నాటక ప్రదర్శన

బీచ్ రోడ్డు: రసజ్ఞ జాతీయ భాషా నాటకోత్సవాలలో భాగంగా పిఠాపురం కాలనీ కళాభారతిలో గురువారం ప్రదర్శించిన డోజో మోజో నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. విభిన్న మనస్తత్వాలు కలిగిన ముగ్గురు వ్యక్తుల కలల నేపథ్యం ప్రధాన అంశంగా డోజో మోజో నాటిక సాగింది. ఎవరికి వారు తమ కలల్ని నిజం చేసుకోవడానికి ఇతరుల ప్రమేయం అవసరం లేదని అనుకునే ఈ ముగ్గురు వారికి తెలియకుండానే ఒకరికొకరు సహకరించుకుని కలల్ని నిజం చేసుకుంటారు. ఈ కథను ఎంతో రసవత్తరంగా ప్రదర్శించి ప్రేక్షకులను అలరించారు. ఈ కథను మల్లేశ్వరరావు ఆకుల అనువాదం చేశారు.

వైఎస్సార్‌సీపీతోనే ప్రజలు

ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



అల్లిపురం మార్కెట్‌లో పూల వ్యాపారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



బామ్మకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే

అల్లిపురం : రాష్ట్ర ప్రజలు వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నారని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన 32వ వార్డులోని పోలీస్ క్వార్టర్స్, దేవాంగుల వీధి, చలువతోట, కర్నాలవీధి, నేరెళ్లకోనేరు, మార్కెట్ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం అందజేస్తున్నారన్నారు. అల్లిపురం మార్కెట్‌తో తనకు గల సంబంధాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. మార్కెట్లో దొంగలు హల్ చేస్తున్నారని, ఈశాన్యంలో గ్రిల్స్ ఏర్పాటు చేయాలని వ్యాపారులు కోరారు. కర్నాలవీధి పకోడీ సందులో మందుబాబులు ఇబ్బంది పెడుతున్నారని స్థానిక మహిళలు ఫిర్యాదు చేయడంతో టూటౌన్ సీఐతో మాట్లాడి సమస్యను వివరించారు. చలువతోటలో ఏడు ఆకుల చెట్లు తొలగించాలని స్థానికులు కోరారు. వారి సమస్యలు అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. పర్యటనలో ఆయనతో పాటు వార్డు పార్టీ ఇన్‌చార్జి మూలే రామిరెడ్డి, మండల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధితులకు అండగా ప్రభుత్వం

ఇండస్ ఆస్పత్రి ఘటనను పరిశీలించిన ఎమ్మెల్యే వాసుపల్లి



ఘటనాస్థలిలో ఎమ్మెల్యే వాసుపల్లి

డాబాగార్డెన్స్ : ఇండస్ ఆస్పత్రి అగ్నిప్రమాదం జరిగిన వెంటనే ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. ఆస్పత్రి రెండు, మూడు ఫ్లోర్లలోకి వెళ్లి ఘటన వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆస్పత్రి ఆపరేషన్ థియేటర్లో ప్లగ్ బోర్డు రిపేర్ చేస్తుండగా షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగిందని తెలిపారు. పూర్తిగా మంటలు అదుపులోకి వచ్చాయని, ప్రమాదవశాత్తు జరిగిన ఘటనపై కూడా ప్రతిపక్షాలు రాజకీయం చేయడం తగదని హితవు పలికారు. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని, వెంటనే చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం, పోలీసుల సహాయంతో ఆస్పత్రిలోని రోగులను ఇతర ఆస్పత్రులతో పాటు కేజీహెచ్ ఐసీయూకు తరలించినట్లు తెలిపారు. అగ్నిప్రమాదానికి గల కారణాలు ప్రాథమికంగా తెలిసాయని, ఫైనల్ రిపోర్ట్‌లో ఆస్పత్రి యాజమాన్యం తప్పిదం ఉంటే తప్పకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న పేషెంట్ల వద్దకు ఎమ్మెల్యే వెళ్లి ఎవరూ భయాందోళనలు చెందనవసరం లేదని భరోసా కల్పించారు.

రేపటి నుంచి లలితా పీఠంలో ధనుర్మాసోత్సవాలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కృష్ణసేన్ తదితరులు

సీతంపేట: లలితానగర్‌లోని లలితా పీఠంలో ఈ నెల 16 నుంచి జనవరి 14 వరకు ధనుర్మాస వ్రత మహోత్సవం జరుగుతుందని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. దీనికి సంబంధించిన కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధనుర్మాస వ్రతంలో భాగంగా కల్యాణ వెంకటేశ్వర స్వామి సన్నిధిలో ప్రతి రోజూ నిత్య కైంకర్యం, విశేష సేవలు ఉంటాయన్నారు. ప్రతి రోజూ ఉదయం 4 గంటలకు సుప్రభాతం, స్వామి, అమ్మవార్లకు అర్చన, బాలభోగ నివేదన, శాతుపాశురాల విన్నపం, గోదా చతుశ్లోకి జరుగుతాయని తెలిపారు. 23న ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం, జనవరి 3న సహస్ర దీపాలంకరణ, 11న కూడారై ఉత్సవం, 14వ తేదీ భోగి రోజున గోదా రంగనాయకుల కల్యాణం నిర్వహిస్తామన్నారు.